

# మను చరిత్ర

## తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డు

పారిస్ ఒలింపిక్స్ షూటింగ్‌లో కాంస్యం

10మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో పతక బోణీ

సత్తాచాటిన నిఖత్‌జరీన్, శ్రీజ, సింధు, మనిక

నిరాశపరిచిన ఆర్చర్లు, శరత్ కమల్, నాగల్



**ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పతక బోణీ అదిరిపోయింది. పోటీల రెండో రోజే పతకాల ఖాతా తెరిచింది. సుదీర్ఘ ఒలింపిక్స్ చరిత్రలో సువర్ణ అధ్యాయానికి శ్రీకారం చుడుతూ యువ షూటర్ మను భాకర్ కొత్త చరిత సృష్టించింది. తనపై పెట్టుకున్న ఆశలను వమ్ముచేయకుండా చెక్కుచెదరని గురితో కంచు మోత మోగించింది. కొరియా షూటర్లతో ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో భాకర్ అద్భుత ప్రదర్శనతో కాంస్య పతకాన్ని సగర్వంగా ముద్దాడింది. తద్వారా ఒలింపిక్స్ షూటింగ్‌లో పతకం గెలిచిన తొలి భారత మహిళా షూటర్‌గా అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకుంది. ఇప్పటికే లెక్కకు మిక్కిలి పతకాలతో రికార్డులు కొల్లగొట్టిన ఈ హర్యానా షార్ప్‌షూటర్ తన కీర్తికిరీటంలో కాంస్యాన్ని చేర్చుకుంది. రౌండ్ రౌండ్‌కు తన ఆధిక్యాన్ని పెంచుకుంటూ పోయిన భాకర్ పారిస్‌ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి పతకాన్ని అందించి మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించింది. టోక్యో ఒలింపిక్స్ చేదు అనుభవాలను చెరిపేస్తూ పారిస్‌లో నవ శకానికి నాంది పలికింది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని మొదలు ప్రముఖుల ప్రశంసల జడిలో తడిసిముద్ద య్యింది. తమతమ విభాగాల్లో నిఖత్, శ్రీజ, సింధు, మనికా, ప్రణయ్, పన్వర్ సత్తాచాటి పతక పోరులో ముందంజ వేశారు.**

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో భారత పతకాల బోణీ కొట్టింది. జూలై 28 భారత క్రీడా చరిత్రలో మరుపురాని రోజు. ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న మహిళల షూటింగ్‌లో పతక కరువు ఎట్టకేలకు తీరింది. చిక్కినట్లే చిక్కి ఇన్ని రోజులు అందని ద్రాక్షలా ఊరిస్తూ వచ్చిన పతకం ఎట్టకేలకు మన ఒడికి చేరింది. భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన యువ షూటర్ మను భాకర్ కాంస్య పతకంతో కొత్త చరిత్ర లిఖించింది. ఆదివారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భాకర్ (221.7) కంచు ఒడిసిపట్టుకుంది. హోరాహోరీగా సాగిన పతక పోరులో కొరియాకు చెందిన వైజే ఒహ్(243.2), వైజే కిమ్(241.3) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. మూడో స్థానంతో ఫైనల్ పోరుకు అర్హత సాధించిన భాకర్ అదే స్థానంతో పతకాన్ని కైవసం చేసుకుంది. తద్వారా పుష్కర కాలం తర్వాత షూటింగ్‌లో భారత్‌కు పతకం దక్కేలా చేసింది. చివరిసారి లండన్(2012) ఒలింపిక్స్‌లో విజయ్‌కుమార్(రజతం), గగన్ నారంగ్(కాంస్యం) దేశానికి పతకాలు అందించారు.

### నాట్ ఓన్లీ షూటర్..
### ఆల్ రౌండర్!

చిన్ననాటి నుంచే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్రీడల్లో చురుగ్గా పాల్గొన్న మనుకు షూటింగ్ కంటే ముందే ఇతర క్రీడల్లోనూ ప్రావీణ్యముంది. రెజ్లర్లు, బాక్సర్లు, హాకీ ప్లేయర్లు అధికంగా ఉండే హర్యానాలో ఆమెకు స్కూల్ ప్రారంభ దశలోనే క్రీడలపట్ల ఆసక్తి కలిగింది. చిన్నప్పుడు బాక్సింగ్, స్కేటింగ్, వాలీబాల్, మార్షల్ ఆర్ట్స్, టెన్నిస్ వంటి ఆటల్లో జాతీయ స్థాయిలో ఆమెకు ఏకంగా 60 దాకా పతకాలు కూడా వచ్చాయి. కానీ 2013లో స్కూల్ వాలీబాల్ టోర్నమెంట్ సందర్భంగా ఆమె కన్నుకు గాయమవడంతో మిగిలిన క్రీడలన్నింటికీ ఫుల్‌స్టాప్ పెట్టేసి 2014 నుంచి పూర్తిగా షూటింగ్ మీదే దృష్టి కేంద్రీకరించింది. హార్స్ రైడింగ్ అంటే ఎంతో ఇష్టమున్న ఆమె వాయిలిన్ కూడా నేర్చుకుంది.

### కాంస్యం.. గీతాసారం

మను తన విజయానికి 'గీతాసారం' ఎంతో స్ఫూర్తినిచ్చిందని తెలిపింది. ''నేను తరుచూ భగవద్గీత చదువుతాను. ఫైనల్ బరిలో నిలిచినప్పుడు గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పిన.. 'కర్తవ్యం మీద దృష్టి సారించు. ఫలితం మీద కాదు' అన్న బోధనలే నా మదిలో మెదిలాయి. నేను ఏదైతే చేయగలనో అది పూర్తి శ్రద్ధతో చేశాను. ఫలితం నా చేతుల్లో లేదు'' అని తెలిపింది. మను తల్లి సుమేధ తరుచూ ఆమెకు గీతలోని 'య సర్వత్రాణాభిస్నేహస్ తత్ ప్రాప్య శుభాశుభం నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞ ప్రతిష్ఠితా' (ఎవడైతే కష్టాలు వస్తే నిరుత్సాహపడకుండా అదృష్టం వరిస్తే ఆనందపడకుండా అన్ని పరిస్థితుల్లోనూ ఒకే విధంగా ఉంటాడో అతడే స్థితప్రజ్ఞుడు) అనే శ్లోకాన్ని చెబుతుందని ఆమె తండ్రి చెప్పాడు.

### తల్లిదండ్రుల ప్రోత్సాహం

మనుకు క్రీడల్లో ఉన్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ఆమె అభ్యున్నతికి పూర్తిగా సహకరించారు. తన క్రీడలకు సంబంధించిన శిక్షణ, పోటీలలో పాల్గొనడంపై ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదు. 2014లో మిగతా క్రీడలకు గుడ్ బై చెప్పి షూటింగ్‌లో జాయిన్ అయితానని చెప్పినప్పుడు మను తండ్రి రాంకిషన్ లక్షా 80 వేల రూపాయలతో కొత్త పిస్టల్ కొనిచ్చారట. 'నేను నేవీలో ఇంజినీర్‌గా పనిచేసేవాడిని. ఇంటికి వెళ్లగానే మను తనకు కావాల్సిన క్రీడాపరికరాల జాబితాను తయారు చేసి నాకు ఇచ్చేది. షూటింగ్‌లో జాయిన్ అయ్యాక పిస్టల్ కావాలంటే అప్పటికప్పుడు రూ. 1.80 లక్షలతో కొనిచ్చా' అని ఆయన తెలిపాడు.


### భలే 'గురూ'!

టోక్యో ఒలింపిక్స్‌లో వైఫల్యంతో చిన్ననాటి కోచ్, గురువు జస్పాల్ రాణాను పక్కనబెట్టిన మను.. 2023లో మళ్లీ ఆయనతో జట్టు కట్టింది. రీయూనియన్ తర్వాత జస్పాల్.. మనుకు కఠినమైన టాస్క్‌లు అప్పజెప్పాడట. శిక్షణ సందర్భంగా నిర్దేశిత టార్గెట్ పాయింట్లు సాధించకుంటే అందుకు జరిమానాలు విధించేవాడట. ఈ టాస్క్‌లతో మను మరింత రాటుదేలింది. 'ఒకసారి నన్ను 582 స్కోరు చేయమంటే నేను 578 చేశాను. 4 పాయింట్లు తక్కువైన నాకు 40 యూరోల ఫైన్ విధించాడు. లేదంటే అంత విలువ గల వస్తువులను తీసుకురమ్మనేవాడు. ఇతరులతో పోలిస్తే ఆయన శిక్షణ పూర్తి భిన్నంగా ఉంటుంది' అని కాంస్యం గెలిచిన తర్వాత మను చెప్పింది.

### పోరు హోరాహోరీ

10మీటర్ల ఎయిర్ పిస్టల్ పోరు పతక పోరు హోరాహోరీగా సాగింది. నువ్వానేనా అన్నట్లు పాయింట్ పాయింట్‌కు ఉత్కంఠ రేపింది. దాదాపు చివరి షాట్ వరకు భాకర్ కొరియా షూటర్లతో ఢీ అంటే ఢీ అన్నట్లు తలపడింది. కిమ్ యెజీ 10.5 పాయింట్లు సాధించగా, భాకర్ 10.3 పాయింట్లతో పసిడి పతక పోరు నుంచి తప్పుకుంది. మొత్తంగా మూడేండ్ల క్రితం టోక్యోలో ఎదురైన వైఫల్యాన్ని భాకర్ కాంస్య పతకంతో కొత్త చరిత్ర లిఖించింది.

### ఫైనల్లో రమిత, అర్జున్



భాకర్ పతకమిచ్చిన స్ఫూర్తితో సహచర షూటర్లు రమిత జిందాల్, అర్జున్ బబుతా తమ తమ విభాగాల్లో ఫైనల్‌కు అర్హత సాధించి ఔరా అనిపించారు. మహిళల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో రమిత 631.5 పాయింట్లతో ఐదో స్థానంతో ఫైనల్ పోరులో నిలిచింది. సోమవారం జరిగే తుది ఫైట్‌లో రమిత తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ఇదే విభాగంలో పోటీపడ్డ మరో షూటర్ ఎలావెనిల్ వాలరివన్(630.7) 10వ స్థానంలో నిలిచి నిరాశపరిచింది. మరోవైపు పురుషుల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ కేటగిరీలో అర్జున్ బబుతా(630.1) ఫైనల్‌కు అర్హత సాధించి పతక పోరులో నిలిచాడు. ఇదే కేటగిరీలో పోటీకి దిగిన మరో యువ షూటర్ సందీప్‌సింగ్(629.3) 12వ స్థానంలో నిలిచి పతక పోరుకు అర్హత సాధించలేకపోయాడు.

### రెండో రోజు నారీ శక్తి

ఒలింపిక్స్‌లో తొలి రోజు ఆశించిన ఫలితాలు రాబట్టడంలో విఫలమైన భారత్ రెండో రోజు మాత్రం అదరగొట్టింది. ముఖ్యంగా మహిళా క్రీడాకారులు ఆదివారం సత్తా చాటారు. షూటింగ్‌లో మను భాకర్.. ఈ క్రీడలో ఇంతవరకూ మహిళలకు దక్కని గౌరవాన్ని దేశానికి తొలి పతకాన్ని అందించి శుభారంభం చేయగా తమ క్రీడలలో పోటీపడ్డ ఇతర మహిళా అథ్లెట్లు సైతం గెలిచి తదుపరి రౌండ్స్‌కు దూసుకెళ్లారు. తెలుగు అమ్మాయిలు పీవీ సింధు, నిఖత్ జరీన్, ఆకుల శ్రీజతో పాటు మనికా బాత్రా, రమిత జిందాల్ విజయనాదాలు చేశారు. షూటింగ్‌లో సోమవారం రమిత జిందాల్ సైతం మెడల్ ఈవెంట్‌కు దూసుకెళ్లి పతక ఆశలు రేపుతోంది. అయితే మహిళల ఆర్చరీ జట్టు నిరాశపరచింది.

### శ్రీజ, మనిక ముందంజ

టేబుల్ టెన్నిస్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. మహిళల విభాగంలో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ, మనికా బాత్రా తదుపరి రౌండ్‌కు ముందంజ వేయగా ఈ ఒలింపిక్స్‌లో భారత పతాకధారి అయిన వెటరన్ ప్లేయర్ ఆచంట శరత్ కమల్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. మహిళల సింగిల్స్ రౌండ్ ఆఫ్-64లో శ్రీజ 4-0 (11-4, 11-9, 11-7 11-8)తో క్రిస్టియానా కల్‌బర్గ్ (స్వీడన్)ను ఓడించి ఏకపక్ష విజయాన్ని నమోదుచేసింది. మరో పోరులో మనిక 4-1 (11-8, 12-10, 11-9, 9-11, 11-5)తో అన్నా హర్సే (బ్రిటన్)ను ఓడించింది. కానీ ఐదో ఒలింపిక్స్ ఆడుతున్న శరత్ కమల్ 2-4 (12-10, 9-11, 6-11, 7-11, 11-8, 10-12) తో డెని కొజుల్ (స్లోవేనియా) చేతిలో అనూహ్యంగా ఓటమిపాలయ్యాడు.





### నిరాశపరిచిన ఆర్చర్లు

ర్యాంకింగ్ రౌండ్‌లో అదరగొట్టి నాలుగో స్థానంతో ముగించి క్వార్టర్స్ చేరిన భారత మహిళల ఆర్చరీ జట్టు కీలకపోరులో చేతులెత్తేసింది. దీపికా కుమారి, భజన్ కౌర్, అంకిత భకత్‌తో కూడిన భారత్.. 0-6 (51-52, 49-54, 48-53) తో నెదర్లాండ్స్ చేతిలో పరాభవం పాలైంది.

### నాగల్ నిష్క్రమణ

భారత టెన్నిస్ సింగిల్స్ ఆటగాడు సుమిత్ నాగల్ ప్రయాణం తొలి రౌండ్‌లోనే ముగిసింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో నాగల్ 2-6, 6-4, 5-7తో కొరెంటిన్ మౌటెట్ (ఫ్రాన్స్) చేతిలో పరాభవం పాలయ్యాడు. రెండున్నర గంటల పాటు గిన ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌లో ఓడినా తర్వాత పుంజుకున్న నాగల్.. మూడో సెట్‌లోనూ ఓడాడు.



### నిఖత్ తొలి పంచ్ అదుర్స్

పసిడి పతకమే లక్ష్యంగా ఒలింపిక్స్ బరిలో నిలిచిన తెలంగాణ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ తొలి రౌండ్‌లోనే తన పంచ్ పవర్‌తో అదరగొట్టింది. మహిళల 50 కిలోల విభాగంలో నిఖత్.. 5-0తో మ్యాక్సీ కరీనా క్లొయెట్జర్ (జర్మనీ)ను మట్టికరిపించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. ప్రీక్వార్టర్స్‌లో ఆమె చైనా బాక్సర్ వు యు తో తలపడనుంది.

### క్వార్టర్స్‌కు పన్వర్

ఒలింపిక్స్ బరిలో ఉన్న ఏకైక రోయర్ బాల్‌రాజ్ పన్వర్ పురుషుల సింగిల్స్ స్కల్స్ ఈవెంట్‌లో క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. శనివారం ముగిసిన ఈవెంట్‌లో నాలుగో స్థానంతో నిరాశపరిచినా ఆదివారం జరిగిన రెపిచేజ్ 2లో 7 నిమిషాల 12.41 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తిచేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. మంగోలియా రోయర్ క్వెంటిన్ రెండో స్థానంలో నిలిచాడు. స్విమ్మింగ్‌లో భారత పోరాటం ముగిసింది. పారిస్ బరిలో నిలిచిన శ్రీహరి నటరాజ్, దినిది సెమీస్ చేరడంలో విఫలమయ్యారు. వంద మీటర్ల పురుషుల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌ను 55.01 సెకన్లలో పూర్తిచేసిన నటరాజ్ 33వ స్థానంలో నిలిచాడు. 14 ఏండ్ల వయసులో ఒలింపిక్స్ ఆడుతున్న దినిది.. 200 మీటర్ల మహిళల ఫ్రీస్టయిల్ హీట్‌లో 23వ స్థానంతో సరిపెట్టుకుంది.

### పతకాల పట్టిక

| దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 4 | 2 | 0 | 6 |
| కొరియా | 3 | 2 | 1 | 6 |
| చైనా | 3 | 1 | 1 | 5 |
| జపాన్ | 3 | 1 | 1 | 5 |
| ఫ్రాన్స్ | 2 | 2 | 2 | 6 |
| యూఎస్ఏ | 1 | 3 | 2 | 6 |
| భారత్ | 0 | 0 | 1 | 1 |

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

### సింధు శుభారంభం

రెండుసార్లు ఒలింపిక్ విజేత, ఈసారి పతకం రంగు మార్చాలని బరిలోకి దిగిన తెలుగమ్మాయి పీవీ సింధు పారిస్‌లో శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు.. 21-9, 21-6తో ఫాతిమా అబ్దుల్ రజాక్ (మాల్దీవులు) పై ఏకపక్ష విజయం సాధించింది. 29 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో నెగ్గిన సింధు.. బుధవారం ఈస్టోనియా అమ్మాయి క్రిస్టిన్‌తో తలపడనుంది. సింధుతో పాటు మరో భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ అదరగొట్టాడు. పురుషుల సింగిల్స్ తొలి మ్యాచ్‌లో ప్రణయ్.. 21-18, 21-12తో ఫాబియన్ రౌత్ (జర్మనీ)ను చిత్తు చేసి శుభారంభం చేశాడు. 45 నిమిషాల్లోనే ముగిసిన పోరులో ప్రణయ్ వరుస గేముల్లో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, తనీషా క్రాస్టో 18-21, 10-21తో కొరియన్ ద్వయం కొంగ్ హి యాంగ్, కిమ్ సొ యాంగ్ చేతిలో ఓడారు.

# లంకదే ఆసియా కప్

ఫైనల్‌లో భారత్ పరాభవం

మెరిసిన హర్షిత సమరవిక్రమ



దంబుల్లా (శ్రీలంక) : మహిళల టీ20 ప్రపంచకప్‌నకు ముందు భారత క్రికెట్ జట్టుకు ఊహించని ఎదురుదెబ్బ. రెండు వారాలుగా దంబుల్లా వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్‌లో ఓటమన్నదే లేకుండా ఫైనల్ చేరిన భారత జట్టు.. తుదిపోరులో ఆతిథ్య శ్రీలంక చేతిలో అనూహ్య ఓటమిని మూటగట్టుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 165 పరుగులే చేయగలిగింది. స్మృతి మంధాన (47 బంతుల్లో 60, 10 ఫోర్లు) టాప్ స్కోరర్. రిచా ఘోష్ (14 బంతుల్లో 30, 4 ఫోర్లు, 1 సిక్సర్) ధాటిగా ఆడి భారత్‌కు గౌరవప్రదమైన స్కోరును అందించింది. అనంతరం ఛేదనలో లంక రెండో ఓవర్లోనే తొలి వికెట్ కోల్పోయినా కెప్టెన్ చమరి ఆటపట్టు (43 బంతుల్లో 61, 9 ఫోర్లు, 2 సిక్సర్లు), హర్షిత సమరవిక్రమ (51 బంతుల్లో 69 నాటౌట్, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడి లంకకు 18.4 ఓవర్లలోనే విజయాన్ని అందించారు. టోర్నీ ఆసాంతం రాణించిన భారత బౌలర్లు ఫైనల్‌లో రెండంటే రెండే వికెట్లు పడగొట్టారు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన హర్షిత.. అనూహ్యంగా చెలరేగి ఆ జట్టుకు తొలి ఆసియా కప్ టైటిల్‌ను అందించడంలో కీలకపాత్ర పోషించింది. ఈ టోర్నీ చరిత్రలో ఆరు సార్లు ఫైనల్ చేరిన లంకేయులకు ఇదే తొలి టైటిల్ కావడం విశేషం. ఫైనల్‌లో బ్యాటింగ్ వైఫల్యంతో పాటు బౌలర్ల ప్రదర్శన నాసిరకంగా ఉండటంతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేనకు ఓటమి తప్పలేదు. ఫైనల్‌లో రాణించిన హర్షితకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కగా టోర్నీ ఆసాంతం రాణించిన ఆటపట్టుకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు లభించింది.

# రెండో టీ20 భారత్‌దే..

రాణించిన బిష్ణోయ్, జైస్వాల్

సిరీస్ కైవసం




పల్లెకెలె: శ్రీలంక పర్యటనలో ఉన్న యువ భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచింది. ఆదివారం పల్లెకెలె వేదికగా వర్షం అంతరాయం కలిగించిన రెండో టీ20ని టీమ్‌ఇండియా 7 వికెట్ల తేడాతో గెలుచుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన లంకేయులు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేశారు. కుశాల్ పెరీరా (34 బంతుల్లో 53, 6 ఫోర్లు, 2 సిక్సర్లు), పతుమ్ నిస్సంక (24 బంతుల్లో 32, 5 ఫోర్లు) రాణించారు. ఒకదశలో 15 ఓవర్లకు 130/3గా ఉన్న ఆ జట్టు ఆ తర్వాత క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో చివరి ఐదు ఓవర్లలో 31 పరుగులు మాత్రమే జోడించి 6 వికెట్లు నష్టపోయింది. భారత బౌలర్లలో రవి బిష్ణోయ్ (3/26) రాణించగా అర్ష్‌దీప్, అక్షర్, హార్దిక్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో వర్షం రావడంతో అంపైర్లు భారత లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 8 ఓవర్లలో 78 పరుగులుగా నిర్ధారించారు. 6.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి భారత్ 81 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (15 బంతుల్లో 30, 3 ఫోర్లు, 2 సిక్సర్లు), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (12 బంతుల్లో 26, 4 ఫోర్లు, 1 సిక్స్), హార్దిక్ పాండ్యా (9 బంతుల్లో 22 నాటౌట్, 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడి మరో 9 బంతులుండగానే విజయాన్ని పూర్తి చేశారు. బిష్ణోయ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఈ సిరీస్‌లో ఆఖరి మ్యాచ్ మంగళవారం జరుగనుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.